క్లుప్తంగా

వంగవీటికి నివాళులు



వంగవీటి చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలు చేసిన వంగవీటి మోహనరంగా వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా శాంతినగర్‌లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వంగవీటి చిత్రపటానికి శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రంగాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ఉప్పర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ గులిగింద లావణ్య సోమవారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ శిథిలావస్థలో ఉన్న సీసీ రోడ్డు దుస్థితిని స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి, సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి, స్థానిక నాయకులు కొండబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పౌర్ణమి పూజలు



విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం



పార్టీ జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకుడు సత్యాంజనేయ

మల్కాపురం : సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. మల్కాపురం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు కె.సత్యాంజనేయ పాల్గొన్నారు. 1925 డిసెంబర్ 26న పార్టీ ఏర్పడిందని, నాటి నుండి పేద ప్రజల సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. పార్టీ నాయకులు గుడాల బాబూరావు, నూనెల సూరిబాబు, గండి అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 27 నుంచి జనవరి 6 వరకు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశామని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. సెక్టార్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

- జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు
- ఉత్సాహంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



షిప్‌యార్డ్ కాలనీ గ్రౌండ్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



షిప్‌యార్డ్ కాలనీ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్సీ మల్లునాయుడు, నాయకులు

గోపాలపట్నం: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఆటల్లో ప్రావీణ్యం ఉండి, అట్టడుగున ఉండిపోతున్న యువతను వెలుగులోకి తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల పరిధిలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే..

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఈ పోటీలు నిర్వహిస్తున్నారని భాస్కరరావు అన్నారు. గ్రామీణ స్థాయిలో మెరికల్లాంటి పిల్లలు ఉంటారని, వారి ప్రతిభకు పదును పెట్టి వజ్రాల్లా మెరిపించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి క్రీడల్లో రాణిస్తున్న వారి వివరాలు తీసుకుని పోటీల్లో పాల్గొనేలా చేశారన్నారు. వార్డు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. క్రీడల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు.వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, చుక్క ప్రసాదరెడ్డి, గేదెల మురళీకృష్ణ, శరగడం సురేష్, ఆళ్ల పైడిరాజు, దేరెడ్ల సత్యనారాయణ, కడిమి రామకృష్ణ, నీలాపు శ్రీనివాస రెడ్డి, ఉష, కమలాదేవి, సుమతి, గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, పలు పాఠశాలల పీడీలు సత్యకళ, బాలరాజు, శ్రీదేవి, స్వామి రాజు, పుణ్యవతి, కళావతి, రమేష్ పాల్గొన్నారు.

జెడ్సీ, ఆర్డీవో సందర్శన

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జోన్–8 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు గోపాలపట్నం గ్రౌండ్‌ను సందర్శించారు. క్రీడలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సచివాలయాల వారీగా జట్ల వివరాలు తెలుసుకున్నారు. లాగిన్‌లో చూపిన విధంగా ఆటల పోటీలు జరగాలని సూచించారు.

క్రీడలతో మానసిక స్థైర్యం

సింధియా: జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యం క్రీడల వల్ల వస్తుందని జోన్ 8 జోనల్ కమిషనర్ మల్లునాయుడు అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా చూసే స్థిరత్వం క్రీడాకారుల్లో పెంపొందుతుందన్నారు. షిప్‌యార్డ్ కాలనీలోని క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను జెడ్సీ జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో పోటీలను ఆసక్తిగా తిలకించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రెహమాన్, ఉమ్మడి విశాఖ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారించి దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, పశ్చిమ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, రేవళ్ల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జోన్–8 జెడ్సీ మల్లయ్య నాయుడు

జూలో రయ్.. రయ్..

- అందుబాటులో బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు
- వృద్ధులు, చిన్నారులకు ఉపయోగకరం



జూ లోపల సైకిల్ తొక్కుతున్న విద్యార్థినులు



జూలో వన్యప్రాణులను చూడడానికి బ్యాటరీ వాహనంలో వెళ్తున్న సందర్శకులు

ఆరిలోవ: జూ పార్కులో సందర్శకులు సరదాగా తిరుగుతూ వన్యప్రాణులను చూడవచ్చు. వృద్ధులు, పిల్లలతో వెళ్లేవారు ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. జూ పెద్దది కావడంతో నడుచుకుంటూ తిరగలేని వారికి అందుబాటులో బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు ఉన్నాయి. యువతీ యువకులు సరదాగా ఎంజాయ్ చేస్తూ వీటిపై ఎంచక్కా జూలో చక్కర్లు కొట్టొచ్చు. జూ పార్కు చాలా విశాలమైంది. లోపల మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లకు ఇరువైపులా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు సుమారు 70కి పైగా ఉన్నాయి. వాటిలో వివిధ జంతువులు, రకరకాల పక్షులు కొలువుదీరి అలరిస్తున్నాయి. జూ పార్కు మొత్తం నడుచుకుంటూ మూడు కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా ఉన్న వన్యప్రాణులను తిలకించాలంటే చాలా కష్టం. యువకులు, విద్యార్థులు మాత్రం ఉత్సాహంగా నడుచుకుంటూ వెళ్లిపోవచ్చు. కానీ వృద్ధులు, చిన్నారు మాత్రం అంత దూరం నడిచి తిరగలేరు. అలాంటి వారి కోసం ఇక్కడ ప్రత్యేక సౌకర్యాలున్నాయి. బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. బ్యాటరీ వాహనంలో 10 మంది వరకు కూర్చొని తిరుగుతూ వన్యప్రాణులను చూడవచ్చు. దీంతో పాటు ఇక్కడ సైకిళ్లు అద్దెకు ఇస్తున్నారు. సైకిల్‌కు గంటకు రూ.50 అద్దె చెల్లించాలి. ఇక్కడ 30 సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఎక్కువగా సైకిళ్లపై తిరుగుతూ వన్యప్రాణులను చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. బ్యాటరీ వాహనాలు 20 వరకు ఉన్నాయి. వీటిలో ప్రయాణించడానికి పెద్దలకు రూ.70, 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.50 రుసుం చెల్లించాలి. ఈ వాహనంలో ఒక గంటలో జూలో వన్యప్రాణులు అన్నింటిని చూసి తిరిగి రావచ్చు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



బలరామాలంకారంలో అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బలరాముని అలంకరణలో అప్పన్న

సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి బలరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బలరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో వేంజేంపచేసి, సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరానికి చెందిన ఎస్.శివకుమార్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో పీఆర్‌వో నాయుడికి అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో ఉక్కు బాలికలు



గిన్నిస్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకున్న బాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు చెందిన శ్రీలయ డాన్స్ అకాడమీ చిన్నారులు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి కళావైభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న శ్రీలయ అకాడమీ చిన్నారులు ఛాయాదీప్తి, హారిక, చంద్రసుమ, విశిష్ట, తేజస్విని, సోహని, లక్ష్మీప్రసన్న అద్భుత ప్రతిభ కనబరిచి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, నటి జ్యోతిరెడ్డి చిన్నారులను అభినందించినట్లు అకాడమీ వ్యవస్థాపకురాలు నరీనా తెలిపారు.

పారిశుధ్య పనిలో ఔట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు



గోపాలపట్నంలో చెత్త తొలగిస్తున్న అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటున్న నేపథ్యంలో పరిసరాలు శుభ్రం చేసేందుకు పారిశుధ్య విభాగం అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు చీపుళ్లు పట్టారు. గోపాలపట్నం 92వ వార్డు పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టారు. అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు చెత్త తొలగించి వాహనాల్లోకి ఎత్తారు. ఇది చూసిన వారు ఆయన పని తీరును మెచ్చుకున్నారు.

57వ వార్డులో 'వికసిత్ భారత్'



మహిళకు క్యాలెండర్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్‌లో పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలు స్క్రీన్‌పై సమగ్ర వివరణ చేపట్టారు. కార్యక్రమంలో జీసీ నాయుడు, నాదెళ్ల జ్యోతి, బీశెట్టి నారాయణరావు, యల్లపు నర్సింగరావు, నాగయ్య, మహేష్, రమణమ్మ, ఆరీ్పలు, హెల్త్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు దత్త జయంతి



దత్త జయంతి వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అగనంపూడి: గురు దత్త జయంతిని అగనంపూడి షిర్డీసాయి మందిరంలో మంగళవారం కనులపండువగా జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దత్తాత్రేయుడిని పూజిస్తే త్రిమూర్తులను పూజించిన పుణ్యం కలుగుతుందన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారికి జ్ఞాపికలు బహూకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వ్యాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పి.రమ్య లక్ష్మి, పి.రామారావు, శంభుడు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీ పోరులో పరుగుల వరద

జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు



విద్యాసాగర్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందిస్తున్న అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ

గోపాలపట్నం: సీఎం జగన్ పుట్టిన రోజు నుంచి 89వ వార్డు చంద్రనగర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జగనన్న పశ్చిమ క్రికెట్ లీగ్ పోటీల ఆరో రోజు పరుగుల వరద పారింది. పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం జరిగిన మూడు మ్యాచుల్లో క్రీడాకారులు హోరాహోరీ పోరాడారు. మొదటి మ్యాచ్ ఓల్డు గోపాలపట్నం వారియర్స్, ముర్రువాని వారియర్స్ మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముర్రువాని వారియర్స్ నిర్ణీత 12 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేయగా ఓల్డు గోపాలపట్నం వారియర్స్ 11 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసి గెలిచింది. ఓల్డు గోపాలపట్నం వారియర్స్ బ్యాట్స్‌మెన్ విద్యాసాగర్ 27 బంతుల్లో 50 పురుగులు చేసి మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ దక్కించుకున్నాడు. అతనికి 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ అవార్డు అందించారు. రెండో మ్యాచ్‌లో పీఆర్ఎస్ఏడీ, చేగువేర యూత్‌కు మధ్య పోటీ జరిగింది. పీఆర్ ఎస్ఏడీ 11 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. చేగువేరా యూత్ జట్టు 10.5 ఓవర్లలో 97 పరుగులకే ఓటమిని మూటగట్టుకుంది. పీఆర్ జట్టు బ్యాటర్ యోగేశ్వరరావు కేవలం 17 బంతుల్లో 68 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ దక్కించుకున్నాడు. అతనికి 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి అవార్డు అందించారు. మూడో మ్యాచ్‌లో గోపి యువసేనకు, బాచి లైన్స్ టీమ్‌కు మధ్య పోటీ జరిగింది. గోపి యువసేన తొలుత బ్యాటింగ్ చేసి 10.5 ఓవర్లలో 56 పరుగులు చేయగా బాచి లైన్స్ కేవలం 5.4 ఓవర్లలో విజయలక్ష్మ్యాన్ని చేరుకుంది. బాచి లైన్స్ బౌలర్ 3 ఓవర్లలో 10 పరుగులిచ్చి 5 వికెట్లు సాధించి మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ దక్కించుకున్నాడు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన
- జనవరి 5న తుది జాబితా ప్రకటన
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఓటరు జాబితాలను పారదర్శకంగా సిద్ధం చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల అధికారులతో గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ పురోగతిపై మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఓటరు జాబితాల తయారీపై ప్రతేక దృష్టి పెట్టామన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం, అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి పేరు మార్పు కోసం డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన ప్రతీ దరఖాస్తును బీఎల్‌వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. బీఎల్‌వోలు చేసిన సర్వేపై మండల స్థాయి అధికారులు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై అన్ని రకాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ సూచనలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేస్తామన్నారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలియజేశారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

పెదగంట్యాడ: మండలంలోని యారాడ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బంగా రాష్ట్రం కోల్‌కతాకు చెందిన రెండు కుటుంబాలకు చెందినవారు విశాఖ పర్యటనకు వచ్చారు. విశాఖ సాగరతీరంలో సరదాగా గడిపిన వారంతా ఓ ఆటోలో యారాడ తీరానికి బయల్దేరారు. యారాడ గ్రామానికి సమీపంలో ఆర్చ్ వద్ద ఆటో అదుపుతప్పింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురితో పాటు ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోయారు. ఆటో డ్రైవర్ రాము తలకు గాయం కాగా ఆటోలో ఉన్న ఆరుగురిలో ఇద్దరి కాళ్లు విరిగిపోగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో దేబాసిస్ దాస్ (44) ఎడమ కాలు విరిగిపోగా, అరుణవా సాహ (38)కు కుడికాలు విరిగిపోయాయి. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. న్యూపోర్టు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బీభత్సం



కాకానినగర్‌లో రోడ్డు దిగువకు దూసుకుపోయిన లారీ

గోపాలపట్నం: కాకానీనగర్ వద్ద జాతీయ రహదారిపై ఒక లారీ బీభత్సం సృష్టించింది. సోమవారం అర్ధరాత్రి పంజాబ్‌కు చెందిన లారీ బొగ్గు లోడుతో వస్తూ రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఏ వాహనాలు అటుగా రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు కూడా ఎలాంటి ప్రమాదం జరగలేదు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు



సందడి చేసిన సినీ నటి అవికాగోర్

దాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎస్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ఆహ్వాన్ ఫెస్ట్' మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. వారందరి స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా చదివి ఇటు కళాశాలకు..అటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రి నాయుడు మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.